క్లుప్తంగా

ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్టు ఏర్పాటు

గాలివీడు : ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా మండలంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రఘురామయ్య పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 13న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సరిహద్దు ప్రాంతమైన వెలిగల్లు, ఇందుకూరివాండ్లపల్లె వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మద్యం, నగదు తరలింపును అరికట్టేందుకు పోలీస్ సిబ్బంది గస్తీ కాయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

వీఆర్‌ఏపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె వీఆర్‌ఏపై స్థానికులు తహసీల్దారు శంకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై శంకర్‌రావు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతూ శాఖరాజుపల్లె వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య జగనన్న కాలనీలకు తరలించే గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడ్డారని తమకు ఫిర్యాదులు అందడంతో అతనికి బుధవారం మెమో జారీ చేశామన్నారు. అదే రోజు రాత్రి ప్రభుత్వ స్థలంలో తన బంధువులకు దగ్గరుండి బేస్ మట్టం నిర్మాణ పనులు చేయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. స్థానిక వీఆర్‌ఓ కోర్టు పనిమీద వెళ్లారని, వీఆర్‌ఓ వచ్చిన తరువాత ఆయనపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : ఎగువపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శంకరయ్య గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లు, జగనన్న గోరుముద్దను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జగనన్న గోరుముద్దను నాణ్యంగా అందిస్తున్నారని కితాబిచ్చారు. అయితే పాఠశాలలో నాడు– నేడుకు సంబంధించి బాత్‌రూమ్, టాయిలెట్ల పనులకు సంబంధించి నిధులు ఆగిపోవడంతో పనులు నిలిపివేశారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీ దిన్నెమీదపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై ఎస్‌ఐ, తన సిబ్బందితో దాడులు నిర్వహించి 3 వ్యక్తులతోపాటు రూ. 1,150 నగదును స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సచివాలయ కార్యదర్శులదే బాధ్యత

రామాపురం : సచివాలయం సిబ్బంది ఎక్కడికెళ్లినా సచివాలయం కార్యదర్శులు బాధ్యత వహించాలని ఎంపీడీఓ హైదర్‌వలీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ కార్యదర్శుల అనుమతి లేనిదే సెలవు, మెడికల్ లీవులు పెట్టకూడదన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయం పాటిస్తూ బయోమెట్రిక్ వేయాలని, బయోమెట్రిక్ హాజరు వేయని గైర్హాజరైన సిబ్బందిపై జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి సెలవు తీసుకోవాలంటే డిజిటల్ అసిస్టెంట్‌కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉషారాణి, ఏఓ శివశంకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గుర్రంకొండ : మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో గురువారం ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామానికి సమీపంలో పెద్ద ఎత్తున జూదం జరుగుతోందనే సమాచారం అందుకొన్న పోలీసులు కలకడ సీఐ నాగేంద్ర, గుర్రంకొండ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.30,310 స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేశారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి

వాల్మీకిపురం : సంప్రదాయ వ్యవసాయ సాగు కంటే ప్రకృతి సాగుతోనే అధిక దిగుబడులతోపాటు ఆదాయం సాధ్యమని ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో రైతు హేమలత తనకు ఉన్న ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తున్న ఏ గ్రేడ్ మోడల్‌లో టమాట, బీన్స్, పెసర, మిరప, వంగ, అరటి, ఉల్లి, కొబ్బరి, ఆముదం, బంతి, ముల్లంగి, బెండ, మొటిక, సిర్రాకు, దంటాకు, చుక్కాకు, గోంగూర, బీర, కాకర, సార, దానిమ్మ, కమల, చీని, నిమ్మ, జామ, సపోటా, అంజీరా, గ్రీన్ ఆపిల్, రెడ్ ఆపిల్ పంటల వ్యవసాయ పొలంను ప్రకృతి సాగు సిబ్బంది స్వాతితో కలిసి యశోదమ్మ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగులో చేపట్టాల్సిన మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే



మాట్లాడుతున్న వైద్యురాలు భగవద్గీత



లక్కిరెడ్డిపల్లి: మాట్లాడుతున్న బలరామరాజు

సంబేపల్లె : లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని సంబేపల్లె వైద్యురాలు భగవద్గీత అన్నారు. గురువారం మండల పరిధిలోని యర్రగుంట్ల కస్తూర్బా బాలికల పాఠశాలలోని విద్యార్థినులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే, వారి మధ్య ఏ వివక్షత ఉండకూడదన్నారు. సమాజంలో అన్నిరంగాల్లో స్త్రీలు పురుషులతో పోటీ పడుతున్నారన్నారు. పుట్టబోయేది ఆడశిశువని తెలియగానే గర్భస్రావానికి కొన్ని కుటుంబాలు సిద్ధపడుతున్నాయన్నారు. దీనిని అరికట్టాలనే ఉద్దేశంతో భారతదేశం గర్భపిండ పరీక్షా ప్రక్రియ- నియంత్రణ దుర్వినియోగ నివారణ చట్టం 1994లో తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం జన్యు సంబంధం పరీక్షలు నిర్వహించే ప్రభుత్వ, ప్రవేటు సంస్థల వైద్యాధికారులు నిర్దేసించిన అధికారుల వద్ద తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : లింగ నిర్ధారణ నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు పేర్కొన్నారు. భేటీ పడావో–భేటీ బచావో కార్యక్రమంలో భాగంగా గురువారం లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో లింగ నిర్ధారణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో కిషోర బాలికలకు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులో వివాహం చేసుకుంటే రక్తహీనత తగ్గి ప్రాణానికి అపాయం ఉంటుందని ఆయన తెలిపారు. వివాహ వయస్సు వచ్చినప్పుడు మాత్రమే వివాహం చేసుకోవాలని, చిన్న వయస్సులో వివాహాలు చేసుకుంటే ఇబ్బందులు పడతారని సూచించారు. ప్రతి బాలిక ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలని, ప్రతినెల పీరియడ్ సమయంలో బాలికలు శుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేఖ, సిహెచ్‌ఓ రవీంద్ర, హెల్త్ సూపర్ వైజర్ వెంకటేశ్వరరెడ్డి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ కుమారి, ఏఎన్‌ఎంలు ఉమామహేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహాల నిర్మాణాల్లో పురోగతిని పెంచండి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి

సిద్దవటం : పక్కాగృహాల నిర్మాణాలపై పురోగతిని పెంచాలని రాజంపేట నియోజకవర్గం ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం పక్కాగృహాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీలలో లబ్ధిదారులు గృహాలను నిర్మించుకునేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రోత్సహించాలన్నారు. ప్రతి రోజు పనులు కొనసాగిస్తూ వివిధ స్థాయిలో పనులు పూర్తయిన లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు బిల్లులను ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు డ్రస్‌కోడ్‌ను ధరించాలన్నారు. సకాలంలో విధులకు హాజరై ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్ సింగ్, తహసీల్దారు శంకర్‌రావు, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య, వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ జీకేవై పథకం ద్వారా సి–డ్యాప్ సౌజన్యంతో కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలలపాటు ఉచిత కంప్యూటర్, హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణతోపాటు కంప్యూటర్ బేసిక్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్ (7013665112, 9059160549)లో సంప్రదించాలని సూచించారు.

రేపు ఏపీ జేఏసీ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 4న కడపలోని వైఎస్సార్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్.జీవన్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, కోశాధికారి కేపీ రొనాల్డ్ శ్యామూల్‌రాజ్ తెలిపారు. ఈ సమావేశానికి అమరావతి ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

బ్లూ కోల్ట్స్ సేవలకు సహకరించండి

రాజంపేట అర్బన్ సీఐ నరసింహారావు



బ్లూకోల్ట్స్ బైకులను ప్రారంభించిన సీఐ నరసింహారావు

రాజంపేట : పట్టణంలో బ్లూ కోల్ట్స్ సేవలకు పట్టణవాసులు సహకరించాలని రాజంపేట అర్బన్ సీఐ నరసింహారావు అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంజూరు చేసిన నూతన బ్లూకోల్ట్స్‌కు అందించిన రెండు బైకులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బ్లూకోల్ట్స్ సేవలకు గాను ప్రత్యేకంగా పోలీసులను కేటాయించామన్నారు. వారు ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటూ కలియతిరుగుతుంటారన్నారు. ముఖ్యంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నెలకొన్న వెంటనే క్లియర్ చేసేందుకు బ్లూకోల్ట్స్ తమ తమ బైకులలో అందుబాటులో ఉంటారన్నారు. పట్టణంలో ఏ సంఘటన జరిగినా సంఘటనా స్థలానికి చేరుకునేలా బ్లూకోల్ట్స్‌ను సేవలందించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. పట్టణంలో గస్తీని ముమ్మరంగా చేసేందుకు పోలీసుశాఖ బ్లూకోల్ట్స్‌ను వినియోగించుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజు, బ్లూకోల్ట్స్ పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

కోటా దుర్గాభవానికి మొల్లమాంబ పురస్కారం



కడప కల్చరల్ : ప్రొద్దుటూరుకు చెందిన కవయిత్రి కోటా దుర్గా భవానీకి మహా కవయిత్రి మొల్లమాంబ సాహిత్య పురస్కారం ఇవ్వనున్నట్లు మొల్ల సాహిత్యపీఠం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో జరగనున్న సభలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం హాజరవుతారన్నారు.

మానవత ఆధ్వర్యంలో చేయూత



చంద్రమౌళికి నగదు అందిస్తున్న మానవత సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : జనవరి 15వ తేదిన గువ్వల చెరువు ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయి తన కుడికాలు విరిగిన చంద్రమౌలి కుటుంబానికి గురువారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రూ. 30వేలు చేయూత అందించింది. చంద్రమౌళి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారని, ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో జీవనోపాధితో ఇబ్బందులు పడుతున్నారనే సమాచారం తెలుసుకున్న సంస్థ చైర్మన్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆయనకు రూ. 30వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మానవత జిల్లా సభ్యులు వై ప్రసాద్ యాదవ్, గమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, న్యాయవాది బాలాజీ రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

12న వ్యాస రచన పోటీలు

మదనపల్లె సిటీ : శ్రీ హనుమంతుని జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం ఆవరణలో జరిగే పోటీల్లో 20 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి గల వారు స్కూల్ ద్వారా గానీ నేరుగా గానీ ఆలయ కమిటీని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు శ్రీరామనవమి రోజు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



విద్యార్థుల తల్లిదండ్రులకు సలహాలు ఇస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ గంగిరెడ్డి

నందలూరు(రాజంపేట) : టెన్త్ విద్యార్థులు బాగా చదివేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలని ఇన్‌చార్జి ఎంఈఓ గంగిరెడ్డి అన్నారు. గురువారం నైట్‌విజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ఉపాధ్యాయులతో కలిసి తల్లితండ్రులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు పూర్తయ్యేంత వరకు టీవీలను కట్టిపెట్టాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలంటే పదవ తరగతి చాలా ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా బాగా చదువుకునేలా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించి పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నతశిఖరాలు అందుకునేలా సిద్ధం అవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, ఖాజాహుస్సేన్, చాన్‌బాషా, చంద్రకాంత్, స్వర్ణలత, గౌరీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకుల సమస్యపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

గుర్రంకొండ : ఏడాది కాలంగా నెలకొన్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యపై తహసీల్దార్ ఖాజాబీ విచారణ నిర్వహించారు. మండలంలోని నడిమిఖండ్రిగ పంచాయతీ గెరికుంటపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఎంపికపై ఏడాదిగా సమస్య నెలకొంది.

గ్రామంలో నెలకొన్న వర్గవిభేదాల కారణంగా రెండు నెలలకు ఒకమారు పాఠశాలలో భోజన నిర్వాహకులను మార్చివేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం గెరికుంటపల్లె గ్రామంలో తహసీల్దార్ ఖాజాబీ పర్యటించారు. పాఠశాలకు చేరుకొని ప్రస్తుతం ఉన్న భోజన నిర్వాహకులను విచారించారు. సమస్య ఎందుకు వస్తోంది అన్న అంశంపై ఆరా తీశారు. తదనంతరం పాఠశాల కమిటీ చైర్మన్‌ను పాఠశాల వద్దకు పిలిపించారు. సమస్య పరిష్కారానికి కమిటీ చైర్మన్ అందరి కంటే ముందుగా చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి రెండు నెలల కొకమారు సమస్య వస్తే నిర్వాహకులకు జీతాల చెల్లించే సమస్యతోపాటు పిల్లలకు భోజనం వడ్డించే విషయంలో సమస్యలు వస్తాయన్నారు. అందరూ కలసికట్టుగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్, హెడ్మాస్టర్ అంజమ్మ, భోజన నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తపురమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కొత్తపురమ్మ తల్లి

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామ శివారులో ఉన్న కొత్తపురమ్మ ఆలయంలో గురువారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి మూలవిరాట్ మూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న సాయిబాబా

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో వెలసిన సద్గురు సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు బండాత్మకూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వాములవారికి ఉంజల్, పల్లకీ సేవలు జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

8న రామాలయ విగ్రహ ప్రతిష్ట



నూతనంగా నిర్మితమైన రామాలయం

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 8వ తేదీన విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు టి.కమ్మపల్లి రామాలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. 5వ తేదీ ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలు, 6, 7వ తేదీలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. 8న విగ్రహ ప్రతిష్ట వైభవంగా చేయనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా మల్లూరమ్మ జాతర



మల్లూరమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

చిన్నమండెం : మార్చి 7, 8న జరిగే మల్లూరమ్మ జాతరను పకడ్బందీగా నిర్వహిస్తామని రాయచోటి రూరల్ సీఐ లింగప్ప పేర్కొన్నారు. గురువారం మల్లూరమ్మ ఆలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మల్లూరమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌కుమార్, సర్పంచ్ నజీర్‌బాషా, ఎంపీటీసీ శ్యాంసుందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస విజయం కోసం సైనికుల్లా పనిచేయండి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



మాట్లాడుతున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : వైఎస్సార్ సీపీ మద్దతుతో పట్టభద్రుల పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కౌన్సిలర్లు సైనికుల్లా పని చేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక టీసీ క్లబ్‌లో గురువారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జెడ్పీ చైర్మన్ పట్టణ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు మరో పది రోజులు మాత్రమే సమయం ఉన్నందున కౌన్సిలర్లు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు వెన్నపూసకు తొలి ప్రాధాన్యత ఓటు వేయించి గెలిపించాలని ప్రతి ఓటరును కలిసి అభ్యర్థించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే సచివాలయాలను ఏర్పాటు చేసి లక్షన్నర మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, అలాగే రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున పెట్టుబడులతో పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్న విషయాలను ఓటర్లకు వివరించాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డి సేవా భావం ఉన్న వ్యక్తి అన్నారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్సీ అయితే ముఖ్యంగా యువతకు, నిరుద్యోగులకు మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అందువల్ల ఈ ఎన్నికల్లో రవీంద్రారెడ్డి విజయం సాధించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, సత్యాల రామకృష్ణ, కౌన్సిలర్లు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

టీబీ పేషెంట్‌లను దత్తత తీసుకున్న ఎంపీపీ



పౌష్టికాహారం అందిస్తున్న ఎంపీపీ బాబుల్ రెడ్డి

పుల్లంపేట : ప్రతి టీబీ పేషెంట్‌కు ఆరునెలలపాటు పౌష్టిక ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కేంద్ర పథకంలో భాగంగా పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి ఆరుగురు టీబీ పేషెంట్లను ఆరు నెలలపాటు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ మాట్లాడుతూ టీబీ పేషెంట్లను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చిన్ని కృష్ణ, ఆర్‌ఓ నరసింహ కుమార్, డాక్టర్ శేఖర్, టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గురు మహేష్, డాక్టర్ మనోజ్, రిటైర్డ్ సీహెచ్‌ఓ పిల్లి పిచ్చయ్య, సీహెచ్‌ఓ రాజ, టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్‌లు పాల్గొన్నారు.

విశ్వ వేదికపైకి మనోళ్లు!

- అంతర్జాతీయ యువజనోత్సవాలకు వైవీయూ విద్యార్థులు
- జాతీయ యువజనోత్సవాల్లో ముగ్గురికి పతకాలు



నిర్వాహకుల నుంచి మెడల్స్ సర్టిఫికెట్లు అందుకుంటున్న వైవీయూ విద్యార్థులు



శిల్పకళా విభాగంలో స్వర్ణం సాధించిన శిల్పం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఖ్యాతిని జాతీయస్థాయి వేదికగా ఎగురవేశారు. కర్నాటక రాష్ట్రంలోని జైన్ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన 36వ అంతర్ విశ్వవిద్యాలయాల జాతీయస్థాయి యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు సత్తాచాటి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో గుజరాత్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశాన్ని విశ్వవిద్యాలయ విద్యార్థులు దక్కించుకున్నారు. రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్యపతకం సాధించి విశ్వవిద్యాలయ ఖ్యాతిని చాటిచెప్పారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ రాణించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

'శ్రమశక్తి'కి స్వర్ణం..



శిల్పకళా విభాగంలో నిర్వాహకులు 'శ్రమశక్తి' అన్న అంశంపై టాపిక్ ఇచ్చి అందుబాటులో ఉన్న సామగ్రితో శిల్పాన్ని తయారు చేయమని సూచించారు. విశ్వవిద్యాలయంలో రెగ్యులర్‌గా సాధన చేస్తూ ఉన్న అనుభవం అక్కడ ఉపయోగపడింది. దీంతో ఉన్న మెటీరియల్‌తో శ్రమశక్తిపై శిల్పాన్ని తీర్చిదిద్దాను. దీనికి ప్రథమ బహుమతి లభించడంతో పాటు స్వర్ణపతకం అందుకోవడం సంతోషంగా ఉంది. అంతర్జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాను.

– బి. గంపమల్లయ్య, బీఎఫ్‌ఏ ఫైనలియర్, వైవీయూ

'ప్రకృతి'కి పతకం..



ఫొటోగ్రఫీ విభాగంలో ఇచ్చిన సమయంలోపు ఉత్తమ ఫొటోలు తీసే అంశంపై నిర్వహించిన పోటీలో పాల్గొన్నాను. ప్రకృతిపై తీసిన ఫొటోలు, శ్రమసౌందర్యాన్ని చాటిచెప్పే ఫొటోలను తీయడంతో ఫొటోగ్రఫీ విభాగంలో ప్రథమస్థానం లభించింది. తద్వారా నిర్వాహకుల నుంచి స్వర్ణపతకాన్ని అందుకున్నాను. అంతర్జాతీయస్థాయి పోటీల్లో సైతం పతకం సాధించాలన్న లక్ష్యంతో సిద్ధమవుతున్నా.

– బి. పవన్‌కల్యాణ్, బీఎఫ్‌ఏ ఫైనలియర్, వైవీయూ

'కార్టూన్'లో కాంస్యం..



జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో కార్టూన్ విభాగంలో పోటీపడ్డాను. 'క్రీడారంగం –మాదక ద్రవ్యాల ప్రభావం' అన్న అంశంపై ఇచ్చిన పోటీలో నేను గీచిన కార్టూన్ మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం కైవసం చేసుకున్నాను. త్వరలో నిర్వహించే అంతర్జాతీయస్థాయి యువజనోత్సవాల్లో మెరుగైన ప్రదర్శనకు కృషిచేస్తా.

– వై. అరవింద్, బీఎఫ్‌ఏ ప్రథమ సంవత్సరం, వైవీయూ